నమస్తే తెలంగాణ
వికారాబాద్
I | హైదరాబాద్, గురువారం 2 మే 2024 | VIKARABAD

ఒక్కో పోలింగ్ కేంద్రంలో
మూడు బ్యాలెట్ యూనిట్లు



- చేవెళ్ల పార్లమెంట్ బరిలో 43 మంది అభ్యర్థులు..
- అభ్యర్థులు పెరుగడంతో అదనంగా బ్యాలెట్ యూనిట్ల వినియోగం
- వికారాబాద్ జిల్లాకు చేరిన 2000 బ్యాలెట్ యూనిట్లు
- నేటితో ముగియనున్న అదనపు బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ
- 5లోపు నియోజకవర్గాల్లోని స్ట్రాంగ్‌రూంలకు తరలింపు
- వికారాబాద్, తాండూరు, పరిగి సెగ్మెంట్లలో మూడు బ్యాలెట్లు

వికారాబాద్, మే 1 (నమస్తే తెలంగాణ) : చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ ఎన్నికల్లో ఒక్కో పోలింగ్ కేంద్రంలో మూడు బ్యాలెట్ యూనిట్లను ఎన్నికల యంత్రాంగం వినియోగించనున్నది. అధికారులు ఇప్పటికే జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రానికీ కంట్రోల్, బ్యాలెట్ యూనిట్ల తోపాటు వీవీప్యాట్లను ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూంలకు తరలించింది. చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ బరిలో 43 మంది అభ్యర్థులు ఉండడంతో అదనపు బ్యాలెట్ యూనిట్ల అవసరం ఏర్పడడంతో ఎన్నికల సంఘం జిల్లాకు

సమకూర్చింది. ఈసీఐఎల్ కంపెనీ నుంచి జిల్లాకు మంగళవారం 2000 బ్యాలెట్ యూనిట్లు చేరుకోగా వాటిని జిల్లా కేంద్రంలోని ఈవీఎంల స్ట్రాంగ్‌రూంలో భద్రపర్చారు. బుధవారం ప్రారంభించిన ఎఫ్ఎల్‌సీ(ఫస్ట్ లెవల్ చెక్) ప్రక్రియను గురువారం పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. అనంతరం బ్యాలెట్ యూనిట్ల ర్యాండమైజేషన్ ప్రక్రియను చేపట్టి 5వ తేదీలోగా ఆయా నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూంలకు వాటిని తరలించనున్నారు. జిల్లాలోని వికారాబాద్, తాండూరు, పరిగి నియోజకవర్గాల్లోని ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మూడు బ్యాలెట్ యూనిట్లు, కొడంగల్ సెగ్మెంట్ లోని పోలింగ్ కేంద్రాల్లో రెండు బ్యాలెట్ యూనిట్లను వినియోగించనున్నారు. ఇప్పటికే మూడు నియోజకవర్గాల్లోని ప్రతి పోలింగ్ కేంద్రానికీ ఒక్కో బ్యాలెట్ యూనిట్లను తరలించగా, త్వరలో మరో రెండు బ్యాలెట్ యూనిట్లనూ చేరవేయనున్నారు. ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ అదనంగా 25 శాతం మేర బ్యాలెట్ యూనిట్లను అందుబాటులో ఉంచనున్నారు. రేపటి నుంచి పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్ ప్రక్రియ ప్రారంభం కానున్నది. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవో, ఏపీవో, ఓపీవోలందరూ పోస్టల్ బ్యాలెట్ ఓట్లను వినియోగించుకునేలా ఏర్పాట్లు పూర్తి చేశారు.

ముమ్మర ఏర్పాట్లు..

పార్లమెంట్ ఎన్నికలకు జిల్లా ఎన్నికల అధికారులు ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే జిల్లాలోని ప్రతి పోలింగ్ కేంద్రానికీ కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లతోపాటు ఓ వీవీ ప్యాట్ తో పాటు కూడిన ఈవీఎంలను తరలించారు. వికారాబాద్ సెగ్మెంట్‌కు సంబంధించిన ఈవీఎంలను వికారాబాద్ జిల్లా కేంద్రంలోని మేరీనాట్ స్కూల్‌లో.. పరిగి సెగ్మెంట్‌కు పరిగిలోని మినీ స్టేడియంలో.. తాండూరు సెగ్మెంట్‌కు సెయింట్ మార్క్స్ స్కూల్‌లో..కొడంగల్ సెగ్మెంట్‌కు కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్‌రూంల్లో భద్రపర్చారు. ఈవీఎంలలో సాంకేతిక సమస్యలు తలెత్తితే మరో ఈవీఎంను ఏర్పాటు చేసేందుకు ప్రతి పోలింగ్ కేంద్రానికీ 25శాతం అదనంగా బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 40 శాతం అదనంగా వీవీప్యాట్లను తరలించారు. పరిగి నియోజకవర్గంలో 305 పోలింగ్ కేంద్రాలుండగా 381-కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, 427- వీవీప్యాట్లను తరలించారు. వికారాబాద్ సెగ్మెంట్‌లో 284 పోలింగ్ కేంద్రాలుండగా 355-కంట్రోల్, యూనిట్లు, 397-వీవీప్యాట్లు.. తాండూరు నియోజకవర్గంలో 277 పోలింగ్ కేంద్రాలుండగా 346-బ్యాలెట్, కంట్రోల్ యూనిట్లు, 397-వీవీప్యాట్లను.. కొడంగల్ నియోజకవర్గంలో 282 పోలింగ్ కేంద్రాలుండగా 352-కంట్రోల్, బ్యాలెట్ యూనిట్లు, 394-వీవీప్యాట్లను కొడంగల్‌లోని ప్రభుత్వ జూనియర్ కాలేజీలోని స్ట్రాంగ్ రూంలో భద్రపర్చారు. పార్లమెంట్ ఎన్నికలకు సంబంధించి జిల్లావ్యాప్తంగా 5028 మంది పీవో, ఏపీవో, ఓపీవోలకు శిక్షణనిచ్చారు. వీరిలో 1257 మంది పీవోలు, 1257 మంది ఏపీవోలు, 2514 మంది ఓపీవోలున్నారు.

చేవెళ్ల బరిలో 43 మంది అభ్యర్థులు..

చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలకు అవసరమైన ఏర్పాట్లను ముమ్మరంగా చేస్తున్నాం. చేవెళ్ల బరిలో 43 మంది అభ్యర్థులున్న దృష్ట్యా ప్రతి పోలింగ్ కేంద్రంలోనూ మూడు బ్యాలెట్ యూనిట్లను వినియోగించేలా ఏర్పాట్లు చేస్తున్నాం. జిల్లాకు అదనంగా అవసరమయ్యే బ్యాలెట్ యూనిట్ల ఎఫ్ఎల్‌సీ ప్రక్రియ, ర్యాండమైజేషన్‌ను పూర్తి చేసి ఈ నెల ఐదులోగా నాలుగు నియోజకవర్గాల స్ట్రాంగ్‌రూంలకు తరలించేందుకు చర్యలు తీసుకుంటున్నాం.

– నారాయణరెడ్డి, వికారాబాద్ కలెక్టర్

గులాబీ దూకుడు

- కేసీఆరే కావాలంటున్న సబ్బండ వర్ణాలు
- జిల్లాలోని అన్ని పార్లమెంటు స్థానాల్లోనూ జోరుగా ప్రచారం
- సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తిస్తున్న పార్టీ ఎమ్మెల్యేలు
- ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న గులాబీ శ్రేణులు
- బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థులకు అడుగడుగునా జనాదరణ
- తలకిందులైన బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అంచనాలు

ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం షాబాద్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ర్యాలీ

రంగారెడ్డి, మే 1 (నమస్తే తెలంగాణ) : లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో గులాబీ దండు కదం తొక్కుతున్నది. బీఆర్ఎస్ ఎంపీ అభ్యర్థుల తరపున గులాబీ దళం ఇంటింటికీ వెళ్లి ప్రచారం నిర్వహిస్తున్నది. మరోపక్క పార్టీ ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు ఇతర ముఖ్యనేతలంతా సభలు, సమావేశాలతో ప్రచారాన్ని హోరెత్తిస్తున్నారు. జనంలో బీఆర్ఎస్‌పై పెరుగుతున్న పాజిటివ్ వేవ్‌తో అటు నేతలు, ఇటు పార్టీ శ్రేణులు సమరోత్సాహంతో ముందుకు సాగుతున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత పదేండ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను గడపగడపకూ వివరించడంతోపాటు కాంగ్రెస్ ఐదు నెలల పాలనలోని వైఫల్యాలను వివరిస్తూ ఓట్లు అభ్యర్థిస్తున్నారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలను నమ్మి మరోసారి మోసపోవద్దని, కేసీఆరే తెలంగాణకు శ్రీరామరక్ష అని ప్రజలకు వివరిస్తున్నారు.

ప్రచారంలో దూసుకెళ్తున్న బీఆర్ఎస్ అభ్యర్థులు..

చేవెళ్ల ఎంపీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్, భువనగిరి ఎంపీ అభ్యర్థి క్యామ మల్లేశ్, నాగర్ కర్నూల్ ఎంపీ అభ్యర్థి ప్రవీణ్ కుమార్, మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డిలు ఎన్నికల ప్రచారంలో దూసుకెళ్తున్నారు. మాజీ మంత్రి సబితాఇంద్రారెడ్డితోపాటు జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ ఎమ్మెల్యేలు, ముఖ్య నేతలు ఎంపీ అభ్యర్థులకు మద్దతుగా సభలు, సమావేశాలు, కార్నర్ మీటింగ్‌లను నిర్వహిస్తున్నారు. కుల సంఘాలు, మత పెద్దలతో ఆత్మీయ సమ్మేళనాలు, సభలు నిర్వహిస్తూ మద్దతు కూడగడుతున్నారు. అన్ని చోట్లా ప్రచారానికి ప్రజల నుంచి అపూర్వ స్పందన లభిస్తున్నది. ప్రచారానికి ప్రజల నుంచి వస్తున్న స్పందన బీఆర్ఎస్ పార్టీ క్యాడర్‌లో జోష్ నింపుతున్నది. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి కారణంగా డీలా పడిన క్యాడర్‌లో ప్రస్తుతం పూర్వ ఉత్సాహం కనిపిస్తున్నది. చేవెళ్లలో నిర్వహించిన కేసీఆర్ బహిరంగ సభ సైతం జిల్లాలో బీఆర్ఎస్‌కు పాజిటివ్ వేవ్‌ను మరింతగా పెంచింది. ప్రజల ఆదరణను చూసి బీఆర్ఎస్ నాయకులు గెలుపుపై ధీమా వ్యక్తం చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీ అంచనాలు తలకిందులు..

లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అంచనాలను బీఆర్ఎస్ పార్టీ తలకిందులు చేసింది. కేసీఆర్ నిర్వహిస్తున్న బస్సు యాత్రకు విశేష స్పందన వస్తుండడం.. కేసీఆరే కావాలని సబ్బండ వర్ణాలు కోరుకుంటుండడం.. ఆ రెండు పార్టీలను ఆత్మరక్షణలో పడవేశాయి. అధికారంలోకి రావడానికి అలవిగాని హామీలు ఇచ్చిన కాంగ్రెస్ మోసం చేసిందంటూ ప్రజలు ఆగ్రహంతో ఉన్నారు. కరువు పరిస్థితులతోపాటు కరెంటు, రైతుబంధు అమలులో కాంగ్రెస్ వైఫల్యం కావడంపై రైతాంగం భగ్గుమంటున్నది. బీజేపీ సైతం ఆది నుంచి తెలంగాణపై వివక్షను చూపిస్తూ వచ్చిందని, అన్ని ధరలు పెంచి ఆగం చేసిందని ప్రజానీకం అసహనం వ్యక్తం చేస్తున్నది. బీఆర్ఎస్ పార్టీయే తెలంగాణకు శ్రీరామ రక్ష అన్న భావన ప్రజల నుంచి వినిపిస్తున్నది.

కాంగ్రెస్, బీజేపీల కంటే కేసీఆరే నయమని, ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలువాలని ప్రజానీకం కోరుకుంటున్నది. సర్వే ఫలితాలు సైతం బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే జిల్లాకు అనుబంధంగా ఉన్న అన్ని ఎంపీ స్థానాల్లోనూ విజయం సాధిస్తామన్న ధీమా గులాబీ క్యాడర్‌లో నెలకొన్నది. ఈక్రమంలోనే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తాను చాటేందుకు క్యాడర్ ఉత్సాహంగా పని చేస్తున్నది.

ఎన్నికల నిర్వహణకు సర్వం సన్నద్ధం

వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న రంగారెడ్డి కలెక్టర్ శశాంక, అధికారులు

- జిల్లా ఎన్నికల అధికారి శశాంక
- ఎన్నికల సన్నద్ధతపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించిన రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్

రంగారెడ్డి, మే 1 (నమస్తే తెలంగాణ) : పార్లమెంట్ ఎన్నికల నిర్వహణకు అవసరమైన అన్ని ఏర్పాట్లను చేపడుతున్నామని చేవెళ్ల పార్లమెంటు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ శశాంక తెలిపారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్ రాజ్ బుధవారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయా జిల్లాల కలెక్టర్లు, ఎన్నికల రిటర్నింగ్ అధికారులతో పార్లమెంటు ఎన్నికల పోలింగ్, కౌంటింగ్, ఓటరు సమాచార స్లిప్పుల పంపిణీ, ఎపిక్ కార్డుల పంపిణీ, పోలింగ్ కేంద్రాల్లో సదుపాయాల కల్పన, పోస్టల్ బ్యాలెట్ కోసం చేపట్టిన చర్యలు, ఓట్ ఫ్రమ్ హోమ్, పోలింగ్ సిబ్బందికి శిక్షణ, ఈవీఎంల ర్యాండమైజేషన్, నియోజకవర్గ కేంద్రాలకు ఈవీఎంల తరలింపు, సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ స్టేషన్ల వద్ద చేపడుతున్న భద్రతా చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఓట్ల లెక్కింపు కేంద్రాలతో పాటు, డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్ల వద్ద చేసిన ఏర్పాట్లు, సువిధ ద్వారా అనుమతుల జారీ, సీ-విజిల్‌లో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారం, పోటీలో ఉన్న అభ్యర్థులకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయడం తదితర అంశాలపై జిల్లాల వారీగా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా చేవెళ్ల పార్లమెంటు సెగ్మెంట్ పరిధిలో ఎన్నికల సన్నద్ధతను కలెక్టర్ శశాంక సీఈవోకు వివరించారు. 43 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో ఉన్నారని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయడంతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించామన్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కోసం 3 బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉన్నదని, ఈ మేరకు బుధవారం ఐసీఐఎల్ నుంచి బ్యాలెట్ యూనిట్లు ఈవీఎం గోడౌన్‌కు చేరుకోనున్నాయని తెలిపారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజినీర్ల బృందంచే వాటి ఎఫ్ఎల్‌సీ జరిపిస్తున్నామని, ర్యాండమైజేషన్ అనంతరం కట్టుదిట్టమైన భద్రత నడుమ నియోజకవర్గ కేంద్రాలకు తరలించేలా చర్యలు తీసుకున్నామని వివరించారు. ఓటరు సమాచార స్లిప్పులతో పాటు ఓటరు గైడ్, సి-విజిల్ కరపత్రాన్ని సైతం సిబ్బందిచే ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయిస్తున్నామన్నారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షణ జరుపుతున్నామని, నిర్ణీత గడువులోపు పంపిణీని పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, 85 సంవత్సరాలు దాటిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లు ఇంటి వద్ద నుంచే ఓటు హక్కును వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలకు డమ్మీ బ్యాలెట్ పేపర్ ద్వారా ప్రయోగాత్మకంగా శిక్షణ ఇప్పించామని, పూర్తి పారదర్శకంగా, గోప్యతను పాటిస్తూ ఓటు సేకరించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నామని కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీవోలు, ఏపీవోలు, ఓపీవోలకు కూడా రెండో విడుత శిక్షణ కొనసాగుతున్నదని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పకడ్బందీ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించేలా చర్యలు తీసుకున్నామని సీఈవో దృష్టికి తెచ్చారు. సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలిస్తూ త్వరితగతిన అనుమతులు జారీ చేస్తున్నామని, సీ-విజిల్ ఫిర్యాదులతోపాటు జిల్లా స్థాయిలో నెలకొల్పిన కంట్రోల్ రూమ్‌కు 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులకూ సకాలంలో స్పందిస్తూ చర్యలు తీసుకుంటున్నామన్నారు. జర్నల్ అబ్జర్వర్, వ్యయ అబ్జర్వర్లతో ఈ నెల 3, 7, 11 తేదీల్లో ఎక్స్‌పెండేచర్ ఇన్‌స్పెక్షన్ జరుగుతుందన్నారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్, డీఆర్‌వో సంగీత, జడ్పీ సీఈవో కృష్ణా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



యాలాల మండల పరిధిలోని కోకట్‌తో పాటు పలు ప్రాంతాల్లో స్ట్రీట్ కార్నర్ సమావేశాల్లో పాల్గొన్న తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రవీందర్ రెడ్డి తదితరులు

బీఆర్ఎస్‌ను గెలిపించాలి

వికారాబాద్, మే 1: సమస్యలు పరిష్కారం కావాలంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే ఆనంద్ అన్నారు. బుధవారం ఆయన వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని జాంబవూర్ తండాలో బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ పార్టీ ప్రజలను మోసం చేసిందని.. హామీల అమల్లో విఫలమైన హస్తం పార్టీకి కర్రు కాల్చి వాత పెట్టాలని పిలుపునిచ్చారు. మరోసారి మోసపోకుండా కారు గుర్తుకు ఓటేసి, పొరపాటును సరిదిద్దుకుందామన్నారు. బీఆర్ఎస్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమన్నారు. కాంగ్రెస్, బీజేపీలతో ప్రజలకు ఒరిగిందేమీలే దన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ అనితాఅనంతయ్య, నాయకులు అనంతయ్య, చందర్, శ్రీనివాస్, గోవర్ధన్, రవి, హన్మంతు, యాదయ్య, శివయ్య, బోవయ్య, రాంచం దర్, రఘుపతి, శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, రవి, చంద్రయ్య, గోపాల్ పాల్గొన్నారు.

జాంబవూర్ తండాలో మాజీ ఎమ్మెల్యే ఆనంద్ ప్రచారం

జాంబవూర్ తండాలో ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆనంద్

కాంగ్రెస్ మాటలను నమ్మొద్దు

తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి

యాలాల, మే 1: మరోసారి కాంగ్రెస్ మాటలు నమ్మి మోసపోవద్దని తాండూరు మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ప్రజలకు సూచించారు. బుధవారం మండలంలోని కోకట్‌తో పాటు పలు ప్రాంతాల్లో స్ట్రీట్ కార్నర్ మీటింగుల్లో మండల పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డితో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారెంటీలన్ని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని ఎప్పుడు అమలు చేస్తుందని ప్రశ్నించారు. రుణమాఫీ అని చెప్పి రైతులను ఆగం చేసిందని మండిపడ్డారు. రైతుల ఉసురు తగిలిన ప్రభుత్వం ఎంతోకాలం ఉండదని హెచ్చరించారు. బీజేపీ, కాంగ్రెస్‌లతో ప్రజలకు ఒరిగేదేమీలేదన్నారు. కొండా విశ్వేశ్వర్ రెడ్డికి ఓటేస్తే వృథానేనని..ఎన్నికలప్పుడే తాండూరుకు వచ్చే రంజిత్‌రెడ్డి కి ప్రజల్లో ఆదరణ లేదన్నారు. బీఆర్ఎస్ సబ్బండ వర్ణాలకు పెద్దపీట వేసిన విషయాన్ని గుర్తించి.. బీసీబిడ్డ కాసాని జ్ఞానేశ్వర్‌కు ఓటేసి భారీ మెజారిటీ అందించి, మన గొంతును ఢిల్లీలో వినిపించాలన్నారు. తాండూరు నీటిని కొడంగల్‌కు తీసుకెళ్తుంటే స్థానిక ఎమ్మెల్యే చోద్యం చూస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ జిల్లా చైర్మన్ రాజూగౌడ్, వైస్ ఎంపీపీ రమేశ్, తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ విఠల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

కోకట్‌లో బీఆర్ఎస్ శ్రేణుల ప్రచారం

ప్రచార హోరు.. సమావేశాల జోరు..

చేవెళ్ల పార్లమెంటు పరిధిలో బీఆర్ఎస్ శ్రేణులు బుధవారం సమావేశాలు, ముమ్మర ప్రచారంతో హోరెత్తించారు. గడపగడపకూ వెళ్లి కారు గుర్తుకు ఓటు వేయాలని అభ్యర్థించారు. బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు చేస్తున్న మోసాన్ని వివరిస్తూ ప్రజలను చైతన్యపర్చారు. ఇరుపార్టీలు పథకాల అమలులో వైఫల్యం చెందాయని ప్రజలకు తెలియజేశారు. బీఆర్ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.

మరోసారి ఆగం కావొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే యాదయ్య

- కాంగ్రెస్‌కు తగిన బుద్ధి చెప్పాలి
- బీసీ బిడ్డ కాసానిని భారీ మెజార్టీతో గెలిపించాలి
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

చేవెళ్లటౌన్, మే 1 : కాంగ్రెస్ పార్టీని మరోసారి నమ్మి ఆగం కావొద్దని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య అన్నారు. బుధవారం చేవెళ్ల మండల కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగిన బూత్ లెవల్ సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం సుభిక్షంగా ఉందన్నారు. అమలుకు సాధ్యం కాని హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌తో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులు దేవుళ్లపై ప్రమాణాలు చేస్తూ మరోసారి మనల్ని మోసం చేసేందుకు యత్నిస్తున్నారని.. తగిన బుద్ధి చెప్పాలన్నారు. బీసీ బిడ్డ కాసానిని గెలిపించుకోవాలన్నారు. కార్యక్రమంలో చేవెళ్ల మండల మాజీ ఎంపీపీ మంగలి బాల్‌రాజ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, మాజీ సర్పంచ్‌లు నర్సింహులు, ఆంజనేయగౌడ్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్లు తలారం నర్సింహులు, గిరిధర్‌రెడ్డి, నర్సింహులు, డైరెక్టర్లు వెంకటేశ్, మహేశ్, చందు, రాంప్రసాద్, వెంకటేశ్ పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

- పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి

పరిగి, మే 1: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి అన్నారు. బుధవారం మం డలంలోని సయ్యద్‌పల్లి, రాపోల్, కాళ్లాపూర్ గ్రామాల్లో ఆయన బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రాంచందర్‌రావుతో కలిసి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా మహేశ్‌రెడ్డి మాట్లాడుతూ హామీల అమల్లో విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వానికి ఈ ఎన్నిక ల్లో ఓటు ద్వారా బుద్ధి చెప్పాలని ప్రజలు నిర్ణయించుకున్నారన్నారు. ఆరుగ్యారెంటీల పేరిట ప్రజలను హస్తం పార్టీ మోసం చేసిందని మండిపడ్డారు. రాష్ట్రాభివృద్ధికి కృషి చేసిన కేసీఆర్‌ను కాదనుకొని తాము తప్పు చేశామని ప్రజలు గ్రహించారన్నారు. కాంగ్రెస్, బీజేపీలతో ప్రజలకు ఎలాంటి మేలు జరుగలేదన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేది కేవలం బీఆర్ఎస్ అధినేత కేసీఆరేనని ఆయన స్పష్టం చేశారు. అందువల్ల ఈ ఎన్నికల్లో కేసీఆర్ బలపర్చిన కాసాని జ్ఞానేశ్వర్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. అనంతరం బీఆర్ఎస్ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి రాంచందర్‌రావు మాట్లాడుతూ పదేండ్ల బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం, ప్రజలు సుభిక్షంగా ఉన్నారని.. కాంగ్రెస్ పాలనలో ప్రజలు అష్టకష్టాలు పడుతున్నారన్నారు. బీఆర్ఎస్‌తోనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ కరణం అరవిందరావు, మున్సిపల్ చైర్మన్ ముకుంద అశోక్, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సురేందర్, బీఆర్ఎస్ పార్టీ మండ లాధ్యక్షుడు ఆంజనేయులు, సీనియర్ నాయకులు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, వెంకటయ్య, వెంకట్‌రాంకృష్ణారెడ్డి, జగన్, జంగయ్య పాల్గొన్నారు.



కారు గుర్తుకు ఓటేయాలని ప్రచారం చేస్తున్న మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి

కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి భయం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్, మే 1: కాంగ్రెస్, బీజేపీలకు ఓటమి భయం పట్టుకున్నదని, అందుకే బీఆర్ఎస్ నేతలను కాంగ్రెస్ పార్టీలోకి చేర్చుకుంటున్నారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య, పార్లమెంట్ ఎన్నికల ఇన్‌చార్జి రాంబాబుయాదవ్ అన్నారు. బుధవారం రాత్రి కాలె యాదయ్య మొయినాబాద్ మండల కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. అనంతరం కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అక్రమంగా డబ్బు సంపాదించిన, భూములను కబ్జా చేసిన నాయకులే పార్టీలు మారుతున్నారని ఆరోపించారు. ఈ పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు 6 నుంచి 7 సీట్లు రావడం ఖాయమన్నారు. కాసాని జ్ఞానేశ్వర్ భారీ మెజార్టీతో గెలుస్తారన్నారు. బీఆర్ఎస్‌కు సీట్లు ఎక్కువ వచ్చినా.. ఓటింగ్ శాతం పెరిగినా కాంగ్రెస్ పార్టీలో ఉన్న నాయకులే ప్రభుత్వాన్ని పడగొట్టడం లేదా రేవంత్‌రెడ్డిని సీఎం సీటు నుంచి దించుతారని సంచలన వ్యాఖ్యలు చేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ కాలె శ్రీకాంత్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు అనంతరెడ్డి, సీనియర్ నాయకులు ఆంజనేయులు, గణేశ్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి నర్సింహాగౌడ్, ఉపాధ్యక్షులు జయవంత్, సుధాకర్‌యాదవ్, రావూఫ్, వెంకట్‌రెడ్డి, రాజు, శ్రీహరియాదవ్, కుమార్, ప్రవీణ్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, దర్గ రాజు, జీఎన్ రాజు, పరమేశ్, రమేశ్, అంజయ్యగౌడ్, లక్ష్మీనారాయణ, ప్రవీణ్, నాగరాజు, బాలు, నవీన్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.